క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న పల్లా దుర్గారావు

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులో చేపట్టిన అభివృద్ధి పనులను వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు పరిశీలించారు. జీవీఎంసీ సిబ్బందితో కలిసి ఆయన సోమవారం వార్డు పరిధిలో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు సంపంగి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌డ్రైవ్‌లో 172 మంది ఎంపిక



జాబ్ డ్రైవ్‌లో ఎంపికైన విద్యార్థులు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల(అటానమస్), నిర్మాన్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కళాశాల ఎన్ఆర్‌సీ అండ్ జేకేసీ విభాగం మెగా జాబ్ డ్రైవ్ నిర్వహించింది. ఎన్ఆర్‌సీ అనుబంధ 8 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. 16 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 8 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి 436 మంది విద్యార్థులు పాల్గొనగా.. 172 మంది ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. అభ్యర్థులు వారిలోని నైపుణ్యాలు పెంపొందించుకుని, ఇంటర్వ్యూను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనక మహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరగనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలి.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 10 అర్జీలు



అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీరామమూర్తి

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ జి.శ్రీరామ్మూర్తి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం సుమారు 10 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో డీటీ, ఆర్ఐ, వీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

పేరుకుపోతున్న జీవీఎంసీ తుక్కు నిల్వలు

ఆరిలోవ: ముడసర్లోవ వద్ద సీవేజ్ ప్లాంట్ ఆవరణ మామిడి తోటలో జీవీఎంసీకి చెందిన కాలం చెల్లిన వస్తువులను కుప్పలుగా పేరుకుపోతున్నాయి. ఏళ్ల తరబడి తుప్పుపట్టిన ఇనుము, ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి చేటుగా మారుతున్నాయి. కాలం చెల్లిన వాహనాలు, పారిశుధ్య పనులకు వినియోగించే డెస్ట్‌బిన్లు, డంపర్ బిన్లు, చెత్త సేకరించే తోపుడు బళ్లు, వాహనాల విడి భాగాలు, టైర్లు నిల్వ చేశారు. నగరంలో అన్ని వార్డుల నుంచి వాటిని తీసుకువచ్చి ఇక్కడ వేయడంతో అవి కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం తుప్పు పట్టడంతో దుర్వాసన వస్తోంది. దీనికి తోడు వర్షం పడే సమయంలో నీరు ఈ విడి భాగాలలో చేరి దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో సమీపంలో ఉన్న ఆరిలోవ కాలనీ, నలభై గజాల రోడ్డులో నివాసితులకు దోమలు బెడద ఎక్కువైంది. మరోవైపు మందుబాబులు తరచూ తమ చేతికి పని చెబుతున్నారు. ఇక్కడ నిల్వ చేసిన తుప్పు పట్టిన విడి భాగాలను ఎవరి కంటా పడకుండా రాత్రివేళ తీసుకెళ్లి చినగదిలి, శ్రీకాంత్‌నగర్ పరిసరాలలో నిర్వహిస్తున్న తుక్కు గొడౌన్‌లలో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వచ్చిన సొమ్ముతో పూటుగా మద్యం తాగుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి ఈ విడి భాగాలను వేలం వేస్తే లక్షల్లో ఆదాయం వస్తుందని స్థానికులు సూచిస్తున్నారు.





ముడసర్లోవ సీవేజ్ ప్లాంట్ ఆవరణలో పాడైన డెస్ట్‌బిన్‌లు, వాహనాల భాగాలు

ఏయూ సమాచారమ్

ఏపీ పాత్రోకు ఘన నివాళి

ఏయూ క్యాంపస్: ఉమ్మడి మద్రాస్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, ఒడిశా రాష్ట్ర తొలి అసెంబ్లీ స్పీకర్, ఏయూ వ్యవస్థాపనకు కృషి చేసిన విద్యా ప్రధాన సర్ రావు బహదూర్ అన్నెపు పరశురామ్ పాత్రో జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఏయూలోని పాత్రో విగ్రహానికి అంబేడ్కర్ వర్సిటీ మాజీ వీసీ ఆచార్య హెచ్.లజపతిరాయ్ పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా లజపతిరాయ్ మాట్లాడుతూ ఏయూ చరిత్రకు కారకుల్లో పాత్రో ప్రముఖులన్నారు. ఉత్తరాంధ్ర విద్యా ప్రదాతగా పరశురాం పాత్రో నిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బి.శ్రీరామ్, రవి, ఆచార్య పి.హరి ప్రకాష్, ఆచార్య జి.సుదర్శనరావు, డాక్టర్ సుదర్శన్ పాల్గొన్నారు.



పాత్రో విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆచార్యులు

న్యాయ కళాశాల ప్రిన్సిపాల్‌గా సీతామాణిక్యం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆచార్య కె.సీతామాణిక్యం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆచార్య వి.విజయలక్ష్మి నుంచి ఆమె ప్రిన్సిపాల్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీతామాణిక్యంకు న్యాయ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, విశ్రాంత ఆచార్యులు అభినందనలు తెలిపారు.



పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న సీతామాణిక్యం

సదరన్ ఇంటర్నేషనల్ విద్యార్థుల ప్రతిభ

ఎంవీపీ కాలనీ: సదరన్ ఇంటర్నేషనల్ విద్యా సంస్థల విద్యార్థులు బీఎస్సీ ఫుడ్ టెక్నాలజీ, ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్ కోర్సుల ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించి సత్తాచాటారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆయా కోర్సుల ద్వితీయ సంవత్సరం ఫలితాలు ఇటీవల విడుదల చేసిన విషయం తెలిసిందే. సదరన్ ఇంటర్నేషనల్ విద్యార్థులు ఫుడ్ టెక్నాలజీ కోర్సులో స్నేహారెడ్డి, వై.శివాంజలి(1వ ర్యాంకు), ఎ.సుప్రియ(2వ ర్యాంకు), టి.శాంతిలీలా(3వ ర్యాంకు) సాధించారు. దీంతో పాటు ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్ కోర్సు ప్రవేశాల్లో వి.భవిత(2వ ర్యాంకు), బి.మీనాక్షి(3వ ర్యాంకు) కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంవీపీ కాలనీలో జరిగిన కార్యక్రమంలో సదరన్ విద్యా సంస్థల సీఎండీ సతీష్ పొన్ననం, డైరెక్టర్ స్వప్న పొన్ననం, ప్రిన్సిపల్ విజయలక్ష్మి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

అప్పన్నకు ఆర్జిత సేవలు



స్వామికి సహస్ర నామార్చన నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. అనంతరం సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. అలాగే స్వామికి సహస్ర నామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులను బేడామండపంలోని వేదికపై అధిష్ఠింపజేసి 1001 నామాలు పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు. భక్తులకు తులసి ప్రసాదం అందజేశారు.

నేడు రేషన్ డీలర్ల సమావేశం

గోపాలపట్నం: సింహాచలం గోశాల జంక్షన్ వద్ద ఎస్ఎస్ఆర్ ఫంక్షన్ హాలులో బుధవారం విశాఖపట్నం జిల్లా జాతీయ ప్రజా పంపిణీ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు రేషన్ డీలర్ల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చెవ్వేటి జీవన్ కుమార్ తెలిపారు. గోపాలపట్నంలో సోమవారం ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్స్ సమస్య లు, ఇబ్బందులపై చర్చించనున్నామన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు ఈ వేదిక ద్వారా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గంట్యాడ అప్పలరాజు, నాగేశ్వరరావు, ఉరుకూటి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

శివుని ప్రతిరూపమే శంకరాచార్యులు

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో జరుగుతున్న గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం కుర్తాళం శంకరాచార్యులు, పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ప్రవచనం చేశారు. జగద్గురు శంకర విజయంపై స్వామివారు చేసిన ప్రవచనం ఆద్యంతం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. శంకరాచార్యులు సాక్షాత్ శివుడి ప్రతిరూపమని, శంకరుల అవతరణ నాటికి భారతావనిలో ధార్మిక వాతావరణాన్ని వివరించారు. సన్యాసాశ్రమ వైశిష్ట్యాన్ని, జప తప హోమాల గురించి తెలియజేశారు. శంకరులు అద్వైత సిద్ధాంతం ప్రచారం ద్వారా దేశంలో జాతీయ సమైఖ్యతకు దోహదం చేశారని చెప్పారు. శంకరాచార్యులు మహాకవి అని, అపారమైన స్తోత్ర వాఙ్మయం, భక్తి సాహిత్యం సృష్టించారని వారి కవిత్వం, బోధనల ప్రభావం నేటికీ సమాజంపై ఉందని అభిభాషించారు. శంకరుల జీవితంలోని పలు సంఘటనలు, ఉదంతాలను సభారంజకంగా ప్రవచించారు. శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని, అశేష భక్తజనం స్వామి వారి భాషణాన్ని ఆలకించి పులకించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ప్రవచిస్తున్న సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.10 లక్షల విరాళం

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి విజయవాడలోని కరెన్సీ నగర్‌కు చెందిన కేతినేని రత్నాకరరావు రూ. 10 లక్షలు అందజేశారు. సంబంధిత చెక్కును దేవస్థానానికి పంపించారు. చెక్కు క్లియరెన్స్ కావడంతో దాతకు బాండ్ త్వరలోనే అందజేస్తామని అధికారులు తెలిపారు.

ప్రజా రవాణా వినియోగంతో కాలుష్య నియంత్రణ



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకుంటున్న మేయర్ హరివెంకటకుమారి



బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి వస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్: వారంలో ఒక్క రోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరివెంకట కుమారి పేర్కొన్నారు. ఆమె తమ క్యాంప్ కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీ కార్యాలయానికి ప్రజా రవాణా ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో చేరుకోగా.. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో విపరీతంగా పెరిగిపోతున్న కాలుష్య నియంత్రణకు వారంలో ఒక రోజు జీవీఎంసీ ఉద్యోగులతోపాటు అందరం ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు. ఎకో-వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో జీరో పొల్యూషన్ కార్యక్రమంలో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహనపర చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యం, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒక రోజు ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించి, కాలుష్య నియంత్రణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

140 మందికి కంటి పరీక్షలు



వైద్య పరీక్షలు అనంతరం కళ్లద్దాలు అందజేస్తున్న రవీంద్ర, తదితరులు

ఎంవీపీ కాలనీ: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు ఉచిత కంటి పరీక్షలు, కళ్లద్దాల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మంగాపురం కాలనీలో జరిగిన ఈ నేత్ర వైద్య శిబిరాన్ని బీజేపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర ప్రారంభించారు. 140 మందికి కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులు అందజేశారు. మరో 60 మందికి రీడింగ్ కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎం.ఎం.మహేష్, పూర్వ అధ్యక్షుడు అశోక్ అగర్వాల్, మేనేజర్ హరీష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చందనం ఊరేగింపు

మధురవాడ : మధురవాడ శ్రీవల్లినగర్‌లోని హజరత్ ముఖ్తియార్ ఆలీ చారిటబుల్ ట్రస్ట్ 22వ వార్షిక వేడుకల్లో భాగంగా సోమవారం సంస్థ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ అహ్మద్ ఆధ్వర్యంలో చందనం ఊరేగింపు అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రార్థనా మందిరంలో అహ్మద్, అతని కుటుంబ సభ్యులు, ఇతర సంస్థ సభ్యులు ముందుగా ప్రార్థనలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీరి ఆచారం ప్రకారం మధురవాడ శ్రీవల్లినగర్ నుంచి కొమ్మాది జంక్షన్, మారికవలస, పరదేశిపాలెం, బోయిపాలెం, భీమిలి క్రాస్ రోడ్స్ మీదుగా గారిపేట వరకు గుర్రపు బగ్గీపై చందనం ఊరేగించారు. సుమారు 15 కిలో మీటర్ల మేర వస్త్రం నేలపై పరిచి దానిపైనే చందనం బగ్గీని నడిపించడం విశేషం. సాంప్రదాయం ఉట్టిపడేలా ఫకీరు మేళా, పులి వేషాలు, థింసా నృత్యాలు, కోలాటం వంటి ఆధ్యాత్మిక, కళారూపాలు మరింత ప్రత్యేకతను తెచ్చిపెట్టాయి. చందనం ఊరేగింపునకు విశేషంగా తరలివచ్చిన భక్తులతో మధురవాడలో పండగ వాతావరణం నెలకొంది.



గుర్రపు బగ్గీపై ఊరేగిస్తున్న చందనం

ప్రభుత్వాస్పత్రుల్లో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మహారాణిపేట: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ శానిటేషన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కార్మికులు కోరారు. ప్రభుత్వ ఆస్పత్రుల కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. జీవో 549 ప్రకారం కార్మికులకు రూ.16 వేల జీతం అమలు చేయాలని, వివిధ కటింగ్‌లు చూపిస్తూ రూ.11,200 మాత్రమే చెల్లిస్తున్నారని యూనియన్ గౌరవ అధ్యక్షుడు వెంకటరావు అన్నారు. త్వరలో ఈ కాంట్రాక్టు ముగుస్తుందని, కాంట్రాక్టు ముగిసే సమయానికి బకాయిలు లేకుండా జీతాలతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ, ఇతర బకాయిలు చెల్లించాలని కోరారు. ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రిలో పీఎఫ్ కట్టలేదని అడిగినందుకు ఆర్.ఆదిలక్ష్మిని సంబంధిత కాంట్రాక్టర్ అన్యాయంగా తొలగించారని, దీనిపై కలెక్టర్ జోక్యం చేసుకొని సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వై.కనకరాజు, డి.రాజేశ్వరి, డి.భాగ్య, కేశవరావు, పోతురాజు, పి.రాజు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు, కార్మికులు

కాలుష్య రహిత ప్రాంతంగా ఆటోనగర్

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్‌ను కాలుష్యరహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) ఏడీ చంద్రమౌళి కోరారు. ఆటోనగర్ ఎఫ్- బ్లాక్‌లో ఎంఎస్ఎంఈ, విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) సంయుక్తంగా సోమవారం నిర్వహించిన స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాన్ని పారిశ్రామిక ప్రాంతమైన ఆటోనగర్‌లో ప్రతీ పారిశ్రామిక వేత్త ఆచరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎంఈ అధికారులు, సిబ్బంది, వాసీవా, ఐలా ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు, ఐలా సిబ్బంది స్వచ్ఛత పక్వాడా ప్రతిజ్ఞ చేశారు. ఎఫ్-బ్లాక్‌లో ర్యాలీ నిర్వహించారు. ఆటోనగర్ వాసీవా అధ్యక్షుడు ఎస్.పాండు రంగప్రసాద్, ఐలా మాజీ చైర్మన్లు వై.సాంబశివరావు, శేషగిరిరావు, ఏడీ ఎఫ్-బ్లాక్‌లో పలు పరిశ్రమల వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంఎస్ఎంఈ ఏడీ, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ బి.ప్రభాకర్ కుమార్, ఏడీలు శ్రీను, మూర్తి, రెడ్డి, ఐలా కార్యదర్శి చీకటి సత్యనారాయణ, వాసీవా కోశాధికారి పర్చూరి ప్రభాకర్, కేవీఎస్ రాజు, రెడ్డి, కృష్ణ ప్రసాద్, ప్రశాంత్, నూకరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆటోనగర్ ఎఫ్-బ్లాక్‌లో మొక్కలు నాటుతున్న పారిశ్రామిక వేత్తలు, ఎంఎస్ఎంఈ అధికారులు

రారండోయ్.. వేడుక చూద్దాం..

- 4 నుంచి జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలు
- 7న తొలి రథయాత్ర
- 8 నుంచి స్వామి దశవతారాలు
- 18న తిరుగు రథయాత్ర

డాబాగార్డెన్స్: నగరంలోని టౌన్‌కొత్తరోడ్డులో వెలసిన జగన్నాథస్వామి రథయాత్ర మహోత్సవం జూలై 4 నుంచి 19వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా 4న గురువారం జ్యేష్ఠ బహుళ చతుర్దశి, సాయంత్రం ప్రతిష్ఠా ప్రారంభ సంకల్పం, 5న అమావాస్య ఉదయం జలాధివాసములు, క్షీరాధివాసములు, రాత్రి విశేష హోమాలు, పంచశయ్యాది వాసములు, 6న ఆషాఢ శుద్ధ పాడ్యమి ఉదయం పూర్ణాహుతి నేత్రోత్సవం, సాయంత్రం 6.30 గంటలకు ధ్వజారోహనం, సుభద్రాదేవి శాంతి కల్యాణం జరపనున్నారు. 7న ఉదయం 9.20 గంటలకు స్వామిని రథంపైకి ఆహ్వానించనున్నారు. సాయంత్రం 4.15 గంటలకు జగన్నాథస్వామి తొలి రథయాత్ర ఉత్సవం అత్యంత వైభవంగా చేపట్టనున్నారు. 8 నుంచి 17వ తేదీ వరకు టర్నర్ చౌల్ట్రీలో గల కల్యాణ మండపంలో దశావతారాల్లో స్వామి భక్తులకు దర్శనమిస్తారు.

తిరుగు రథయాత్ర..

18న ఉదయం 12.15 గంటలకు స్వామి రథంపైకి ఆహ్వానించనున్నారు. సాయంత్రం 5.10 గంటలకు టర్నరు చౌల్ట్రీ నుంచి మేళ తాళాలు, బాణసంచా, మంగళవాయిద్యాల నడుమ జగన్నాథ నామస్మరణతో వేద పండితుల పారాయణాలతో అత్యంత వైభోవపేతంగా తిరుగు రథయాత్ర నిర్వహించనున్నారు. 19న ఉదయం సంప్రోక్షణ, పీఠారోహణం అనంతరం స్వామిని యథాస్థానంలోకి పెట్టనున్నారు.

నిత్యపూజలు..

జూలై 8 నుంచి 17 వరకు నిత్యపూజలు నిర్వహించనున్నారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు స్వామి మేలుకొలుపు, నాదస్వరం, 6 నుంచి 7 వరకు నిత్యపూజ, ఉభయదాతల గోత్రనామాలతో పూజాధికములు, 7 నుంచి 9.30 గంటల వరకు జగన్నాథస్వామి ప్రార్థనాగానసంఘంచే ప్రార్థనా తరంగిణి. 9.30 నుంచి 10.30 వరకు లలితా సహస్రనామ పారాయణ, మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సామూహిక భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణ వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు ప్రతిరోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 9 రోజుల పాటు పాల్గొనే భక్తులు దేవస్థాన కార్యాలయంలో రూ.500 చెల్లించినచో గోత్ర నామాలతో ఆయా రోజుల్లో పూజ జరిపించనున్నారు. దశావతార అలంకరణలు చేయుదలచే భక్తులు ముందుగా ఆలయ కార్యనిర్వాహణాధికారి టి.రాజగోపాల రెడ్డిని కార్యాలయంలో సంప్రదించవచ్చు.



జగన్నాథ, సుభద్ర, బలభద్రస్వామి

స్వామి అవతారాలు..

8న మత్స్యావతారం, 9న కూర్మావతారం, 10న వరహావతారం, 11,12న నృసింహావతారం, 13న వామనావతారం, 14న పరశురామావతారం, 15న శ్రీరామావతారం, 16న బలరామ-శ్రీకృష్ణావతారం, 17న తొలి ఏకాదశి, శేషపాన్పు అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.



రథయాత్రకు సిద్ధంగా ఉన్న స్వామి రథం

బోసిపోయిన దువ్వాడ రైల్వేస్టేషన్

ప్రధాన రైళ్ల రద్దుతో ప్రయాణికులు రాక వెలవెల



దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ఖాళీగా ఉన్న ప్లాట్‌ఫామ్‌లు

అగనంపూడి: విశాఖ నుంచి విజయవాడ, హైదరాబాద్ వంటి ప్రధాన నగరాల మధ్య నడుస్తున్న జన్మభూమి, సింహాద్రి, రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు కావడంతో ప్రయాణికులు రాక దువ్వాడ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలు సోమవారం బోసిబోయాయి. దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల్లో అధిక శాతం మంది ఈ మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్ల మీదే ఆధారపడి ఉన్నారు. ఈ మార్గంలో ప్రయాణం చేసే 24 జతల రైళ్ల ద్వారా ఎంతమంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారో ఈ మూడు రైళ్ల ద్వారా అంతమంది ప్రయాణం చేస్తారు. అలాంటి కీలకమైన రైళ్లన్నీ రద్దు చేయడంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలు వెదుక్కుంటున్నారు. దీంతో రైల్వేస్టేషన్ బోసిపోయింది. ఈ మూడు రైళ్లు రద్దు కావడంతో వందలాది మంది డైలీ పాసింజర్లు కూడా ఇబ్బంది పడుతూ రోడ్డు రవాణా మార్గాన్ని ఎంచుకుంటున్నారు.

'మీల్స్ అగ్రిమెంట్‌ను వ్యతిరేకిస్తున్నాం'

మల్కాపురం: కార్మికులకు సంబంధించిన మీల్స్ అలవెన్స్‌కు సంబంధించి ఐఎన్‌టీయూసీ ఇటీవల షిప్‌యార్డ్ యాజమాన్యంతో చేసి అగ్రిమెంట్‌ను తాము వ్యతిరేకిస్తున్నామని షిప్‌యార్డ్ సీఐటీయూ యూనియన్ ప్రతినిధులు బి.ఎస్.ఎన్.రాజు, ఎస్.ప్రసాద్ అన్నారు.ఈ అంశంపై మల్కాపురం సీఐటీయూ కార్యాలయంలో వద్ద సోమవారం వారు మాట్లాడుతూ మీల్స్ అలవెన్స్‌పై ఇటీవల యాజమాన్యం ఇచ్చిన సర్క్యులర్ ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. షిప్‌యార్డ్ స్టాఫ్, కార్మికులకు నష్టం కలిగించే విధంగా ఉందన్నారు. 2014లో సీఐటీయూ మీల్స్ అలవెన్స్ పెంపుదల చేసి, ఎరియర్స్ ఇప్పించిన సంగతిని వారు గుర్తు చేశారు. ఇప్పుడు ఐఎన్‌టీయూసీ (గుర్తింపు యూనియన్) చేసిన అగ్రిమెంట్‌లో మీల్స్ అలవెన్స్ పెంచినా ఎరియర్స్ లేకుండా చేశారని ఆరోపించారు.దీని వల్ల కార్మికులు నష్టపోతారన్నారు.